# సంధ్యా సమయం

## బి.వి.రమణారావు



గంగరాజు, లింగరాజు, గవ్రరాజు, ; త్రి రాజు, వీర్రాజు, సర్రాజు అం ా సహస్రనామం పారాయణం చేస్తూ ం ా రావును లేపేను. ఒళ్ళువిరుచుకుని "అప్ప దే తెల్లారిపోయి ా" అంటూ లేచాడు. "తెల్లార డం కాదు బ్రదర్ చీకటి పడింది. ఇవాళ ఆదివార మగుటంజేసి మధ్యాన్నం బజ్జున్నావు." అని నేను జ్ఞాపకం చేయగానే మనసారా మరోసారి ఆవలించి లేచి మంచం మీదే కూర్చుని మధ్యాన్నం ఊాఊ దుఃఖాన్ని పునఃస్మరణ మొదలెట్టేడు.

"ఇంకనేను ఈ జీవితం గడపలేను" అన్నాడు రాజు.

"దేహం చాలిస్తావా?"

"నేనింక క్యారియర్ భోజనం చెయ్యను"

"బలవంతం లేదు"

"హోటలు ప్రొప్రయిటర్ని చంపేస్తాను."

"ఈశ్వరేచ్ఛ"

"పీపిలో పారేస్తే ఆ అన్నాన్ని కుక్కలు కూడా ముట్టుకోటం లేదు. వెధవ భోజనం వాడూనూ. ఆనపకాయ కూరా, ఆనపకాయ పులుసూ, ఆనపకాయ పచ్చడీ! హుఁ! ఈ బాధ భరించలేను! నా తరంకాదు! నాతరం కాదు" అంటూ మళ్ళీ మూర్ఛ పోయాడు.

మళ్ళీ ఇంత హఠాత్తుగా మూర్ఛ పోవ టానికి కారణ మేమిటంటే - ఇక్కడ వీడు స్పృహొచ్చి కన్నీరు మున్నీరుగా విల పిస్తుంటే. అదే సమయంలో వెనకింటి కామేశ్వరమ్మగారు కొంప మునిగిపోయినట్టు పోపు గరిటచుంయ్ మనిపించింది. ఆ వాసన ఆం విషవాయువులాగ పని చేసినసందర్భంలో రాజుకి మళ్ళీ ప్రాణంమీద కొచ్చింది.

సంజీవి లాంటి రెండు సిగరెట్ దమ్ములు లాగిన తర్వాత కానీ రాజు మళ్ళీ తేరుకో లేదు. రాజు మా పిన తండ్రి కొడుకు. మా వూళ్ళో యింటి పట్టునే వుంటూ బియ్యే వరకూ చదివి ఉద్యోగం దొరికితే మూణ్ణెల్ల క్రితం హైదరాబాద్ వొచ్చి నాతోనే వుంటున్నాడు. మా ఆవిడ ఆర్నెల్ల క్రితం పుట్టి టి కెళ్ళినప్పట్నుంచీ హోటల్ భోజన సాధన చేస్తూ ఆ సాత్విక ఆహారాని కలవాటు పడి ఇంద్రియాల్ని జయించేను. వీడింకా జిహ్వాని పట్టుకు వేళ్ళాడుతున్నాడు. మరి యిక "డీ వాల్యుయేషన్" వొచ్చేక హోటెల్ ధర్మమా•అని మనుషుల్లో ఆధ్యాత్మిక చింత ప్రబలింది. అనంత సౌందర్యం బ్రహ్మ స్వరూపమనీ (అట్టి పరబ్రహ్మ స్వరూపమే 'అన్న' మనీ. మనస్సుకు నాటేటట్టు దానిలో ధగ ధగ మెరిసే నవరత్నాల్లాంటి 'రాళ్ళు'

దోహదకారులౌతాయి. సర్వం జగన్నాథం అనే టువంటి వేదాంత సారానికి చిహ్నం 'సాంబారు'. రంగు, రుచి, సువాసనా అనే వ్యామోహాలు భ్రమలనియూ, సకల చరాచర జీవరాసుల యందూ, చేతనాచేతన పదార్థముల యందూ వుండే టువంటి మూల పదార్థమొకటే ననియూ ఇంద్రియములచే నెరుంగబడు భేదములన్నియూ, బాహ్య రూపములకు చెందినవే ననియూ జ్ఞానులచే గ్రహింపబడినటువంటి తత్వబోధనలకి 'కూర'లే ప్రత్యక్ష నిదర్శనాలు. ఈనాటి నావలపు ఏనాటిదో అంటూ జన్మాంతర సంబంధాలు గురించీ కర్మసిద్ధాంతం గురించీ అమర సందేశాన్నిచ్చేది 'ఊరగాయ.' ఈ విధంగా భోజనం ద్వారా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడయిన ఆయొక్క విష్ణుమూర్తి విశ్వరూప సాక్షాత్కార భాగ్యం కలిగించడానికి మూలపురుషుడైన హోటల్ ప్రొప్రయిటర్ని రాజు చంపేస్తాననడం నాకు సుతరామూ ఇష్టం లేదు.

ఇంతకీ రాత్రి క్యారియర్ రాగానే హోటల్ ప్రొప్రయిటర్ మీదున్న కోపంతో పట్టుకొచ్చిన కుర్రాణ్ణి రాజు మెడ విరిచే ప్రమాదం వుందని గుర్తించి, సాహసించి యింటి వెనక గోడ ఎక్కేను. వెట్టంత పులిసి చీకటి పడ్డాక గోడెక్కి [illegible] చూసేక "అయ్యబాబోయ్! దొంగ!" అంటూ కెవ్వుమని కామేశ్వరమ్మగారు కేక పెట్టకుండా వుండటానికి కారణం వుంది. మేమీ యింట్లో చేరిన నాటి రోజు నుంచీ ఉదయం, సాయంత్రం కూడా వాళ్ళ చిన్నపాయి తాలూకు టెన్నిస్ బాల్ మా దొడ్లో పడుతుండటం, ముద్దుముద్దుగా నే నాగ ఎక్కి అందించటం పరిపాటయింది.

"ఏం నాయనా!" అంది కామేశ్వరమ్మ గారు.

"ఏంలేదు దొడ్డమ్మగారూ. మా వాడు రెండురోజులు పట్టి లంఖణాలు. రాత్రి మధ్యాహ్నమే ఓ మెతుకు కొరికేడు. ఇంకా అన్న హితవులేదు. కాస్తంత నాలిక్కి రాసుకోడానికో నిమ్మకాయ బద్ద...." అన్నను తెగించి. "అయ్యో! అంతకంటేనా బాబా! అలాగే వుండు" అంటూ ఇద్దే ఇంట్లో కెళ్ళి అప్పుడే ఓ గిన్నెలో చారు, ఓ ప్లేట్లో నిమ్మకాయ తీసి గొచ్చి "చారు మా అమ్మాయి సంధ్య పెట్టింది నాయనా, ఎలావుందో! ఏమిటో" అంటూ అందించింది. మహా ప్రసాదమనుకుంటూ మా వాడి ముందర పెట్టేను. దీనిని ఆధారంగా చేసుకుని మా రాజు ఆరోజు షడ్రసోపేతంగా భోంచేస్తుంటే నా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగేయి. పన్నెండేళ్ళ క్రితం వీడు గుండ్రంగా దుంపలాగుండేవాడు. ఆ రోజుల్లో వాడి బరువు ఎముకల్లేకుండా సుమారు నూరు కిలో గ్రాములు. ఇప్పుడు ఎముకలతో సహా ఎనభై కేజీలని వాడే చెప్పాడు.

భోజనానంతరం ఒక క్షణం చడా మడా ఆలోచించి "ఒక హోటలు ప్రొప్రయిటర్ని చంపి ప్రయోజనం లేదు. వెంటనే వాడి స్థానే పదిమంది మొలుస్తారు. కామేశ్వరమ్మగారి యాదృచ్ఛిక భిక్ష రోజూ అర్థించడము సబబు కాదు. అంచేత వంటిల్లు బూజులు దులుపు. ఇప్పుడే వెళ్ళి కావలసిన సరుకులు తెస్తాను" అన్నాడు రాజు.

"నాకు వంట రాదు, నీ యిష్టం" అన్నాను.

"ఆడాళ్ళు చేసేపాటి మనకు రాదా ఏమిటి! నలభీమపాకా లంటారు. వినలేదూ అసలు వంటకి మొగాళ్ళు ప్రసిద్ధి. నేర్చుకుంటే అదే వొస్తుంది. పాకశాస్త్రం మీద ఓ పుస్తకం కూడా పట్టుకొస్తాను కావలిస్తే" అన్నాడు కృతనిశ్చయుడై బట్టలు వేసుకుంటూ.

"కొన్నాళ్ళ పాటు క్యారియర్ కూడా తెప్పించుకుందాం" అన్నాను. కీడెంచి మేలెంచమన్నారని.

"నీ ఇష్టం" అన్నాడు.

"పోనీ ఆలోచించి మంచిరోజు చూసి మొదలెడదాం" అన్నాను.

"చెప్పు చాల్లే. ఇంతకంటే మంచి రోజేమిటి? రేపొద్దున్న తెల్లారగట్లే ఎనిమిదింటికల్లా నన్ను లేపెయ్యి" అన్నాడు బయటికి వెడుతూ.

ఉదయం రాజు చాలా హుషారుగా ప్రతిజ్ఞ పాలిస్తూ యజ్ఞానికి రంగంలోకి దిగేడు. పాకశాస్త్ర గ్రంథంలో మూడు పదార్థాల కెదురుగా 'టిక్' పెట్టుకున్నాడు. 'చపాతి' 'వెజిటబుల్ కూర్మా' మరియు 'చైనాబర్ఫీ' ఈ బర్ఫీ ఏమిటా అని పుస్తకం తిరగేసి చూశాను. కావలిసిన దినుసుల పట్టీలో యిలా వుంది. 'ఒక పదలం కల్తీలేని శనగపిండి, ఒక ఏబులం చక్కెరా, ఒక ఏబులంన్నర కలగలుపు లేని శుభ్రమైన నెయ్యి (ఆవు నెయ్యి దొరికితే మరీ శ్రేష్ఠం. నిలవా వుంటుంది బర్ఫీ గుల్ల విడిచి నోట్లో వేసుకోకుండానే కరిగిపోయేటట్టుంది) ఒక చటాకు పొట్టు లేని జీడిపప్పు, పదిహేడు ఏలక్కాయలు, ఒక స్పూన్ మిఠాయిరంగు చిటికెడు వంట సోడా, రోజ్ వాటరుంటే వేసుకోవచ్చు.

ఆ పట్టీ ప్రక్కనే మావాడు భిన్నాలూ, దశాంశాలు వస్తున్నాయని జంకకుండా ఆ తూకాల్ని మెట్రిక్ పద్ధతిలోకి లెఖ్ఖకట్టి రాసుకున్నాడు.

పనిమీద బయటకు వెళ్ళి తిరిగొచ్చేటప్పటికి అప్పుడే బర్ఫీ పూర్తయినట్టుంది. దాన్ని ముక్కలు చెయ్యడానికి లాగుంది. శుభ్రంగా కడిగి, తడారిపోయేవరకూ తుడిచి, ఒక్క పిసరు నెయ్యి (ఏ నెయ్యి బర్ఫీ చెయ్యడములో వుపయోగించేమో, అదే వాడుకోవాలని రాసివుంది లాగుంది) నేతిగిన్ని అడుగునించి తీసి గునపానికి నిలువనారాసి దాంతో కుస్తీ పట్టడాని కుపక్రమించేడు. కావలసిన పరికరాల్లో దాన్ని నమలడానికి అదనంగా మరో ముప్ఫయి రెండు పళ్ళు కావాలని పుస్తకంలో లేకపోడం శోచనీయం. బహుశః అది చైనావాళ్ళు తమ బంగారు పళ్ళతో నమలగలరేమో! ఒక చెదిరిన చిన్నముక్క నోట్లో వేసుకున్నాక కొరుకుతున్నది బర్ఫీయో. పళ్ళో తెలియలేదు. ఎముక ముక్క అని కరకజ్జంలాగ పటపట లాడించే మా పక్కింటి వాళ్ళ కుక్క నేను పడేసిన చిన్న బర్ఫీ ముక్క చుట్టూ గంటనుంచి ప్రదక్షిణం చేస్తూ దాసోహం అని దాన్ని శివలింగం లాగ ఆరాధిస్తుంటే చూసి ఇక ఇది నిలవ వుండటం విషయంలో ఢోకా లేదని తేలిపోయింది. ఇది నూటికి నూరుపాళ్ళు భూమ్మీద శాశ్వతం. ఇంతటి సౌమ్యమైన పదార్థాలతో, ఇంత దృఢమైన పదార్థం తయారవడం సంభవమని ఏ పదార్థ శాస్త్రజ్ఞుడూ

ఊహించైనా వుండదు. ఈ బర్ఫీని కొరక గలిగినవాడు తిరగలి రాయిని పీచు మిఠాయి లాగ నమల గలడనడానికి సందేహం లేదు.

చపాతీ నోట్లోపెట్టుకోగానే, భారతదేశం పారిశ్రామికంగానూ, వైజ్ఞానికంగానూ వెనక పడి వుండటానికి కారణం కళ్ళకి కట్టినట్టు కనపడింది. ఈ రోజుల్లో ప్రతి చిన్న పరిశ్రమలోనూ విదేశ వస్తువులకోసం ఎగబడటం పరిపాటయిపోయింది. స్వదేశీ ముడి పదార్థాలతో ఉత్పత్తిచేసి దేశంలో స్వయం సమృద్ధి సాధిద్దామన్న దీక్ష లేదు.

ప్రతీ అడ్డమైన వాడికీ స్కాలర్‌షిప్ యిచ్చి రీసెర్చి చెయ్యమంటే దేశం ఎలా పురోగమిస్తుంది? రిసెర్చి చేసేవాడికి జన్మతః నేర్పుండాలి. రాజు మేధ అద్వితీయం. ఒక్క చపాతీ డన్‌లప్ కంపెనీకి, ఒక్కచపాతీ బాటా కంపెనీకి పంపిస్తే శాశ్వతమైన టైర్లూ, చెప్పులూ భారతీయులకి సత్వరంగా లభించడం తథ్యం. నిజంగా రాజుకి "చర్మవిభూషణ్" అనే ప్రత్యేక బిరుదైనా యివ్వడం ప్రభుత్వం యొక్క తక్షణ కర్తవ్యం.

ఇంతలోకే ఎక్కణ్ణుంచో మతాబా కాలిన వాసన వేస్తుంటే ఎక్కడా అని పరీక్షిస్తే అది మూత పెట్టిన వెజిటెబుల్ కూర్మాగిన్నెలోంచి అని గ్రహించి, మూత తీస్తే ఏటంబాంబులాగ ప్రేల్తుందేమో నన్న భయంతో దగ్గిరే నిలబడ్డ రాజును జబ్బ పట్టుకు పక్కకి లాగి హాల్లోకి తీసుకెళ్ళి కుర్చీలో కూలేశాను. ఈ వంటలో వుపయోగింప బడ్డ గిన్నెలూ, గరిటెలూ మొదలయిన పరికరాలు తోమడానికి పనికొచ్చే రసాయన ద్రవ్యాలూ, సాధనాలు దొరకవని గ్రహించి వాటిని వీలయితే కరిగించి మళ్ళీ పోత పోయించుకో వచ్చుని సమాధాన పడ్డాను. అవన్నీ పెరట్లో పడేసింతర్వాత, అవి తయారుచేసే విధానంలో వివరింపబడిందో లేదోకాని, పది లీటర్ల ఫినైల్ పోసి ఆ గదంతా కడిగేక కాని అక్కడ నిలబడే సాహసం లేక పోయింది.

ఈ దుఃఖంలో కుర్రాడు తెచ్చి పడేసిన క్యారియర్ సంగతే మరిచిపోయాం. ఇంతలోకే దైవానుగ్రహం చేత కామేశ్వరమ్మ గారు పిలిచి "రాజారావుకు పాపం పత్యం వంటబట్టిందా! ఇదిగో ఇవి పట్టుకెళ్ళుబాబూ! ఈ పూట కూడా మా అమ్మాయి సంధ్యే చేసింది" అంటూ మళ్ళీ పథ్యం దినుసులు అందించింది. సమయానికి నాకో ఆలోచన తట్టింది. "దొడ్డమ్మగారూ, అడుగుదా మనుకుంటూనే మరచి పోతున్నాను. మీ అబ్బాయిని రోజూ యిక్కడికి పంపించండి. రాజుకూడా తీరుబడిగానే వున్నాడు. కాస్త పాఠాలు చెబుతాడు. కుర్రాడు ఉషారైన వాడూ. మాకూ మీ ఋణం తీర్చుకున్నట్టుంటుంది" అన్నాను.

"ఇంకానయం; ఇందులో రుణమేముంది నాయనా! మీ అభిమానంకొద్దీ అలా అంటున్నావు అసలే అల్లరికుంక మావాడు. పాఠం చెప్పకపోయినా భయం చెప్పి కూర్చోపెడితే



ప్రతాప్ - సున్నంమిల్లు

4 - 5 అడుగుల పళ్ళెము సైజులో 7. 5 H. P.

మోటారుతో, నవీన పద్ధతులతో, తక్కువ ఖర్చుతో

ఎక్కువ దిగుబడి నిచ్చునది తయారుచేయుచున్నామని

తెలియపర్చుటకు సంతసించుచున్నాము.




* మా గువ అడ్రసుతో సంప్రతించండి *

Tel : "FOUNDRY"

ప్రతాప్ ఇండస్ట్రీస్

PHONES : Works 34 RAMAVARAPPADU
Show Room : 5487, 4324


ఎనికేపాడు, విజయవాడ - 5

చేతు, అంతకంటేనా బాబూ!" అం ఆవిడ అంబరమంత సంబరమైన మొహంతో.

మా కథకి పదిరోజులు ఇంటర్వెల్. ఈ పది రోజులూ శ్రద్ధగా మా రాజు, వాళ్ళ బ్బాయి టెన్నిస్ బంతితో ఆడుకుంటూ ప్రాణ స్నేహితులైపోయారు. అసలు ఆ అబ్బాయికి స్కూలన్నా, పాఠాలన్నా, మేస్టర్లన్నా పరమ అసహ్యం. అలాంటిది నేటి కాలానికి ఇంతటి ఆదర్శమైన ప్రవేటు మేస్టరు దొరకడంతో కుర్రాడి గురుభక్తి విపరీతంగా పెరిగిపోయి రోజూ, కూరో, పచ్చడో, పులుసో గురుదక్షిణగా తెట్టావడం మొదలెట్టాడు. ఆ పదార్థాలన్నీ వాళ్ళక్కయ్యే చేసినట్టు తెలిసినప్పుడల్లా రాజు ఆ అమ్మాయిని గురించి చాలాచాలా వివరాలు సేకరించడం మొదలెట్టేడు. ఆ అమ్మాయి గరల్స్ పోలీటెక్నిక్‌లో చదువుకుంటుందిట, ఇప్పుడు పరీక్ష రోజులుట. ఆ అమ్మాయి పొద్దున్నే స్కూలుకి వెళ్ళి సాయంత్రం బస్సులో వస్తుందిట. సినిమాలకి ఎప్పుడేనా వాళ్ళ నాన్నగారితో వెళ్తుందిట. కుర్రాడు చెప్ప గలిగినంత చెప్పేడు.

తనకి ఇంత అమృత తుల్యమైన వంటకాలు అందిస్తున్న అమ్మాయిని కనీసం ఒకసారయినా చూడటం ధర్మమనుకున్నాడట. కాని సాహసించి వాళ్ళింటికి వెడితే వ్యవహారం బెడిసిందంటే చేతులారా నోట్లో మట్టి కొట్టుకున్నట్టవుతుందని ఉద్యమం విరమించుకున్నాట్ట. ఏమయినా రాజు చాలా పట్టుదల మనిషి. ఆత్మాభిమానం, పౌరుషం వున్నవాడు. ఇంతకీ జరిగిన దేమిటంటే.... పదిరోజుల అనంతరం ఓ శుభముహూర్తాన మొహంలో ఆనందంతో బ్రహ్మతేజస్సు తాండవిస్తూండగా సిగ్గు పడుతూ నన్ను ప్రేమతో దగ్గిరకి తీసుకుంటూ "నేను సంధ్యను ప్రేమించేను" అన్నాడు.

"నువ్వసలా అమ్మాయి నెప్పుడయినా చూశావా ?" అన్నాను ఆశ్చర్యంగా. కేవలం ఆ అమ్మాయి కాచిన చారుని రుచి చూసి ఈ నిర్ణయాని కొచ్చేడేమోనని.




"చూశాను, చాలా అందంగా వుంటుంది" అన్నాడు సిగ్గుతో ముడుచుకుపోతూ. చూశానంటే చాలా అందంగా వుండటం, వుండకపోవటం అన్నది చూసే కళ్ళమీద ఆధారపడి వుంటుంది. గోడమీద కెక్కినప్పుడు రెండు మూడు సార్లు దూరంగా కనబడింది. అంత పరిశీలించి చూడలేదు కాని చాలా అందంగా వుంటుందని ఢంకా బజాయించి చెప్పలేను. ఏమయినా వాడికి నచ్చడం మన కథకి ముఖ్యం.

"ఎప్పుడు చూశావు ?" అడిగాను.

"నాల్రోజుల క్రితం నేను ఐదున్నరకల్లా వచ్చేసి బస్‌స్టాండ్ కెళ్ళి సిగరెట్లు కొనుక్కుంటుంటే అప్పుడే బస్సు దిగి ఆ అమ్మాయి మన ఇంటి వెనక సందులోకి వెడుతూంది. సందు మొగలో మా శిష్యుడి చెయ్యి పట్టుకుని లాక్కెడుతూంటే సంధ్యని ఆనవాలు పట్టేను. అయినా సందేహ నివృత్తికోసం, సందు సగందూరం వరకూ నడిచి నిర్ధారణ చేసుకున్నాను. అదీకాక ఆ అమ్మాయి ఇంట్లో కెళ్ళిపోతూండగా మా శిష్యుడు దూరంగా నన్ను చూపెట్టి ఆ అమ్మాయితో ఏదో చెప్పాడు. ఆ అమ్మాయి వెనక్కి తిరిగి నన్ను చూసి చిరునవ్వు ప్రసాదించింది."

"వెరీ గుడ్ :". అన్నాను భుజం తడుతూ.

"తర్వాత వరసగా రెండ్రోజులు సంధ్య బస్సు దిగే సమయానికి అక్కడ కాసి మా మూగ మనసులు ఒకళ్ళ నొకళ్ళు యిచ్చి పుచ్చుకున్నాం."

"పలకరించలేకపోయావా ?"

"నిన్న పలకరించేను."

"ఏమన్నావు ?"

"చారు చాలా బాగుందన్నాను. ఆ అమ్మాయి ఖంగారు పడి నిన్న సమాధానం చెప్పలేదు. పట్టు విడవకుండా యివ్వాళ సాయంత్రం మళ్ళీ కల్సుకుని వంకాయకూర చాలా బాగుందన్నాను. ఆ అమ్మాయి ఆనందంతో ఉక్కిరి బిక్కిరై 'మీకు బాగుండటం కంటే నాకు కావల్సిందేముందీ' అంది"

"ఇంకనేం"

"నువ్వో ఉపకారం చెయ్యాలి బ్రదర్. రేపొద్దున్నే కామేశ్వరమ్మగారితో ఆ అమ్మాయి పెళ్ళి విషయంలో వాళ్ళ అభిప్రాయమేమిటో కనుక్కుందూ" అన్నాడు; వాడి నగుమోము చేతుల చాటున దాచుకుంటూ, అభయ హస్తమిచ్చేవరకూ అదే పోజులో కూర్చున్నాడు.

సినిమాల ప్రభావం అనండి, ప్రచారంలో వున్నసాహిత్యం ప్రభావమనండి, ఈమధ్య యిలాంటి ప్రేమ వివాహాలు జరగటం సర్వసామాన్యమైపోయింది. ఇంతకీ నేను సంతోషించే దేమిటంటే మా వెనక యింటి

వాళ్ళదీ కూడా సాంప్రదాయమైన కుటుంబం. అందుకే ఆ అమ్మాయికూడా రిక్షావాణ్ణి, టాక్సీ డ్రైవర్నీ, పడవవాణ్ణీ, చాకలాణ్ణీ ప్రేమించమని సినిమాలు బోధించే యీ రోజుల్లో మరీ అంత బరి తెగించకుండా కాస్త ముందూ వెనకా ఆలోచించి, సత్సంప్రదాయ కుటుంబంలో పుట్టిన మా రాజుని మోహించింది.

పొద్దున్నే గోడా రూఢుండనై పరమేశ్వ రమ్మ గారితో మావాడి వంశవృక్షమంతా పొగిడి పెళ్ళి సంగతి కదలేశాను. ఆవిడ వాళ్ళ వంశాన్ని మోతాదుగా పొగుడుకుని వాళ్ళకి సంధ్య ఒక్కర్తే అమ్మాయనీ, అన్ని ముచ్చట్లూ జరపాలనుకుంటున్నట్టూ వివరించి రాజారావు తండ్రి ఎడ్రస్ తీసుకుని వాళ్ళాయన్ని వెంటనే వుత్తరం రాయమంటానని చెప్పి నా సత్సంకల్పాన్ని వేనోళ్ళ ఆశీర్వదించింది.

మర్నాడు మళ్ళీ సంధ్యా సమయం అవగానే ముస్తాబై బస్సు దగ్గర కాసి ఆ అమ్మాయిని కొంచెం చొరవచేసి "ప్రేమించి పెళ్ళి చేసుకోడం యిష్టమా, పెళ్ళాడి ప్రేమించుకోడం యిష్టమా" అని సినిమా పొడుపు ప్రశ్న వేశాను, ఆ అమ్మాయి "మీ కేదిష్టమైతే నా కదే యిష్టం, ఏమైనా దయుంచి రోడ్డుమీద నిలబెట్టి మాట్లాడటం మానెయ్యండి" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయిందిట.

గ్రుస[illegible] రోజులు తిరక్కుండా మా చిన్నాన్న వొచ్చేశారు. వీణ్ణి వెంటబెట్టుకొని లాంఛనప్రాయంగా పెళ్ళిచూపుల కెళ్ళేరు. ఆయన కూడా వాళ్ళ సంప్రదాయాన్ని పొగిడి కుర్రాడి ప్రయోజకత్వానికి మురిసిపోయి సంబంధం ఖాయంచేసుకొని తాంబూలా లిచ్చుకుని బయల్దేరి వెళ్ళిపోయేరు. ఆ సాయంత్రం బస్సు టైముకి వీడింట్లోనే కూర్చోటం చూసి ఆశ్చర్యపోయి "ఏరా! సంధ్యా సమయంలో యిక్కడున్నావు" అన్నాను. చిన్న చిరునవ్వు విసిరి "చిన్న ఠోకరా తిన్నాను బ్రదర్! నేను ప్రేమించిన అమ్మాయి సంధ్యకాదు. సంధ్యేమో రోజూ నాలుగున్నరకే యింటికి వెళ్ళిపోతుందిట. నే నా అమ్మాయిని యివ్వాళే చూశాను. ఈ అమ్మాయి పరీక్షలు కదా! రోజూ సాయంత్రము సంధ్యతో చదువుకోడానికి ఆవింటి కొస్తుందట. నా శిష్య పరమాణువు బావమరిది వెధవ కుంకగాణ్ణి చేరదీసి ఆ అమ్మాయి కొంచెం నాటకమాడిందిట! ఏమయినా సంధ్య కూడా చాలా బుద్ధిమంతురాలు" అన్నాడు అందం చందం సంగతి ఎత్తకుండా, బహుశా 'చారు' మతుడై.

***


ఫోను: 6357.

మా అభిమానులకు

## దీపావళి శుభాకాంక్షలు

# శ్రీ పద్మనాభ ప్రింటింగ్ వర్క్సు

ఆటోమేటిక్ ప్రింటర్స్, బుక్ బైండర్స్ అండ్ రబ్బర్ స్టాంప్ మేకర్స్

మూకానివారి వీధి — హనుమానులుపేట.

## విజయవాడ-3